క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకున్న అందరికీ ధన్యవాదాలు

షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన ఎన్నికల సరళిని చూస్తుంటే రాష్ట్రంలో మళ్ళీ జగనన్న ప్రభుత్వమే కచ్చితంగా రానుందని తెలిపారు. సోమవారం ఉదయం నుంచి పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న 253 పోలింగ్ బూతులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ప్రతి బూత్‌లోనూ ప్రజలు స్పష్టంగా జగనన్నకు తమ కృతజ్ఞతను తెలియజేయాలనే భావనంతో ఉన్నారని తెలిపారు.

దొంగ ఓట్లు వేసిన టీడీపీ కార్యకర్తలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా భవానీపురం బాజీబాబా మందిరం రోడ్‌లోని శ్రీచైతన్య కళాశాలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం దాదాపు పోలింగ్ ముగిసే సమయంలో ఒక వ్యక్తి ఓటు వేయడానికి బూత్‌కు రాగా అక్కడ టీడీపీకి చెందిన వ్యక్తి ఒకరు ఇక్కడ నీకు ఓటు లేదని చెప్పారు. దీనిపై అసలు ఓటరు విచారించగా తన ఓటును టీడీపీకి చెందిన ఒక వ్యక్తి దొంగ ఓటు వేసిన విషయం తెలిసింది. అతనితో పాటు మరో వ్యక్తి ఓటుకు సంబంధించిన స్లిప్‌ను ఏజెంట్‌నని చెప్పుకుంటున్న టీడీపీ వ్యక్తి చింపేశాడు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులకు చెప్పగా వారు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. సీసీ కెమేరాలను పరిశీలిస్తే ఓటు దొంగ ఎన్నిసార్లు వచ్చాడో తెలుస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు చెబుతున్నారు.

బాధ్యత ముందు తలవంచిన అనారోగ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చైతన్యవంతులైన ఓటర్లు వయసు, అనారోగ్యం, వైకల్యాని లెక్క చేయకుండా ఓటు వేశారు. విద్యాధరపురంలో నివసిస్తున్న ఒక మహిళ ఇటీవలె ఆపరేషన్ చేయించుకుంది. లేవలేని పరిస్థితుల్లో కూడా తన ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఆకాంక్షతో విద్యాధరపురం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి కుటుంబ సభ్యుల సహకారంతో వచ్చింది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆమెను వీల్ చైర్‌లో కూర్చోబెట్టి ఓటు వేయించి తిరిగి జాగ్రత్తగా ఇంటికి పంపించారు. అది చూసిన ఓటర్లు వారి సేవస్ఫూర్తికి అభినందించారు.

ఎస్‌ఐ దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాధితులు న్యాయం కోసం స్టేషన్‌కు వస్తే దురుసుగా వ్యవహరించటమే కాకుండా వారిపైనే కేసులు కట్టి నిందితులుగా మార్చే ఆ ఎస్‌ఐ ఇప్పుడు ఏకంగా పబ్లిక్‌గా వందలాది ప్రజల ముందు మీసం మెలేసి.. తొడగొట్టి మీ చేతనయింది చేసుకోండంటూ ఛాలెంజ్ చేశాడు. భవానీపురం సర్ ఆర్థర్ కాటన్ హైస్కూల్లో పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. గొల్లపూడి సెక్టార్ ఎస్‌ఐ రామకృష్ణ ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. స్వాతి థియేటర్ ప్రాంతంలో షాపులన్నింటినీ మూసి వేయించగా శయన జనరిక్ మెడికల్ షాప్ మాత్రం తెరిచి ఉంది. అందులో టీడీపీ నాయకులు ఓటర్ల వద్ద స్లిప్‌లు తీసుకుని డబ్బులు పంచుతున్నారు. విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు విషయాన్ని ఎస్‌ఐ రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన షాపులో ఉన్న టీడీపీ నాయకుల దగ్గర గల ఓటర్ స్లిప్‌లు, డబ్బు తనిఖీ చేసి వారిని అక్కడ నుంచి పంపించి వేశాడు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు తెల్లముఖం వేసి అదేంటి సార్ మేము మీకు అప్పగిస్తే వారిని ఎందుకు వదిలేశారని ఎస్‌ఐ రామకృష్ణను ప్రశ్నించారు. అంతే రెచ్చిపోయిన రామకృష్ణ మీసాలు తిప్పుతూ.. తొడలు కొడుతూ నన్నే ప్రశ్నిస్తారా? ఇక్కడి నుంచి వెళతారా లేదా అంటూ బూతుల పురాణాన్ని అందుకున్నాడు. ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ అటుగా వెళుతూ సర్ ఆర్థర్ కాటన్ స్కూల్ వద్దకు వచ్చారు. దీంతో కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్ ఇతర నాయకులు ఎస్‌ఐ రామకృష్ణపై ఫిర్యాదు చేయగా ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు.

కౌంటర్లు, క్యూలైన్ల తనిఖీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న సేవలపై ఈవో కేఎస్ రామరావు సోమవారం ఆరా తీశారు. ఆలయ ప్రాంగణంలోని ప్రసాదం కౌంటర్లు, క్లోక్‌రూమ్‌లు, చెప్పుల స్టాండ్‌లను తనిఖీ చేశారు. క్లోక్‌రూమ్, చెప్పుల స్టాండ్‌లలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ తరఫున సిబ్బందితో మాట్లాడారు. భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరో వైపు గాలిగోపురం నుంచి క్యూలైన్ మార్గంలోకి ప్రవేశించిన ఈవో మార్గమధ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణంలో ఇబ్బందులపై ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో కూలర్లు, మంచినీటి సదుపాయంతో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని, ఇంకా ఏమైనా వసతులు కల్పిస్తే బాగుంటుందని బావిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఉదయం 10.30 గంటల నుంచే అమ్మవారి అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్నామని, దర్శనం అనంతరం అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించాల్సిందిగా భక్తులకు సూచించారు.







బొడెమ్మ హోటల్ సెంటర్‌లో పార్టీలకు చెందిన నేతలను చెదరగొడుతున్న పోలీసులు, టీడీపీ వర్గాన్ని నిలువరిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ, తన అనుచరులతో బూత్‌లోకి ప్రవేశించిన టీడీపీ నేత ఎంఎస్ బేగ్, హిందూహైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు

పశ్చిమంలో ప్రశాంతంగా పోలింగ్

పెరిగిన పోలింగ్ శాతం

- అడుగడుగున కవ్వింపు చర్యలకు పాల్పడిన కూటమి నాయకులు
- భవానీపురం, వించిపేటల్లో ఉద్రిక్తతకు దారితీసిన పరిస్థితులు
- ప్రారంభంలో మొరాయించిన ఈవీఎంలు
- ఉదయం పోలింగ్ బూత్‌లకు పోటెత్తిన మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటుపై అవగాహన పెరగటంతో స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున ఎన్నికల్లో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచినట్లు రాజకీయ నాయకులు చెబుతున్నారు. సుమారు ఐదు మాసాలుగా పోటాపోటీగా జరిగిన ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికి సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రజలు తమకు ఇష్టమైన నాయకులను ఎన్నుకునేందుకు అవసరమైన తీర్పునిచ్చారు. వేసవిలో మండుటెండలో ప్రజానీకం బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది పోలింగ్ శాతం పెరగటం చాలా స్పష్టంగా కనిపించింది. ప్రస్తుత ఎన్నికల్లో 68.30 శాతం పోలింగ్ నమోదు కాగా 2019 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో సుమారుగా 66.12 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. అయితే సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకూ మాత్రమే పోలింగ్ శాతం 68.30 శాతం కాగా ఇంకా ఓటును వినియోగించుకుంటున్న వారు క్యూలైన్లలో ఉన్నారు. కనుక అర్ధరాత్రి వరకూ నియోజకవర్గంలోనూ పోలింగ్ జరిగే అవకాశముండటంతో పోలింగ్ శాతం ఇంకా పెరిగే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు.

టీడీపీ కూటమి నాయకులు పశ్చిమ నియోజకవర్గంలో అడుగడుగున కవ్వింపు చర్యలకు తెగబడ్డారు. భారీ సంఖ్యలో ఒక్కసారిగా బూత్‌లోకి వెళ్లటం, అదేమని ప్రశ్నిస్తే గొడవకు దిగటం చేశారు. ఓట్లు తమకు పడటం లేదని భావించిన నాయకులు ఈ విధమైన గొడవకు దిగి రెచ్చగొట్టడం ద్వారా లబ్ధి పొందాలని టీడీపీ, బీజేపీ నేతలు కుట్రలకు పాల్పడ్డారు. ముఖ్యంగా భవానీపురంలోని సర్ ఆర్థర్ కాటన్ పాఠశాలలో టీడీపీకి చెందిన కార్యకర్తలు దొంగ ఓట్లు వేయటానికి ప్రయత్నించటంతో వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుకొని వారిని పోలీసులకు అప్పగించారు. అయితే పోలీసులు వారిని వదిలేయటంతో వివాదం చెలరేగి పెద్ద గొడవకు దారితీసింది. అలాగే వించిపేటలోని గాంధీబొమ్మ సెంటర్‌లో సుజనాచౌదరి, జలీల్‌ఖాన్, ఎంఎస్ బేగ్ తదితర నేతలు అక్కడ బూత్‌ల్లోకి వెళ్లి హల్‌చల్ చేయటానికి ప్రయత్నించటంతో స్థానికంగా ఉన్న వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య కొద్దిసేపు వాదోపవాదాలు జరిగాయి.

ఆర్‌సీఎంలో ఆసిఫ్, సుందరమ్మ హైస్కూల్‌లో వెలంపల్లి...

కొత్తపేట సుందరమ్మ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో స్థానిక శాసన సభ్యుడు, సెంట్రల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా పశ్చిమ నియోజకవరగ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ తారాపేట ఆర్‌సీఎం హైస్కూల్ ప్రాంగణంలోని పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



వన్‌టౌన్ అన్నపూర్ణ మునిసిపల్ స్కూల్ వద్ద క్యూలో ఓటర్లు



వెలగపూడి లక్ష్మణదత్ పాఠశాల వద్ద క్యూలో ఓటర్లు



కేబీఎన్ కళాశాలలో బారులుతీరిన ఓటర్లు



కేదారేశ్వరపేటలోని పోలింగ్ కేంద్రంలో నగరవాసులు

ప్రారంభంలో మొరాయించిన ఈవీఎంలు...

నియోజకవర్గంలో పలు పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించాయి. ముఖ్యంగా ఉదయం ఎన్నికలు ప్రారంభం కాగానే ఆయా బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించటంతో ఓటు వేయటానికి వచ్చిన ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్తపేట హిందూ హైస్కూల్, తారాపేట ఆర్‌సీఎం హైస్కూల్‌తో పాటుగా చాలా ప్రాంతాల్లోని బూత్‌ల్లో ఈ విధమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. దాంతో ఎన్నికలు బాగా ఆలస్యంగా కొనసాగాయి. దాంతో ఎండవేడికి ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

పశ్చిమంలో ఎన్నికల సరళి...

పశ్చిమ నియోజకవర్గంలో 253 పోలింగ్ బూత్‌లో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ప్రతి ఓటరు ఒకటి అసెంబ్లీ అభ్యర్థికి, రెండవది లోక్‌సభ అభ్యర్థులకు ఓట్లు వేశారు. ఉదయం ఏడు గంటలకు ఎన్నికలు ప్రారంభం కాగా ఉదయం తొమ్మిది గంటలకు 11 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే ఉదయం 11 గంటలకు 23 శాతం పోలింగ్ నమోదైంది. అదేవిధంగా మధ్యాహ్నం ఒంటి గంటకు 37 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే మూడు గంటలకు 51.30 శాతం నమోదైంది. సాయంత్రం నాలుగు గంటలకు 54.20 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 58.05 శాతం, సాయంత్రం ఆరు గంటలకు 68.30 శాతం నమోదైంది. ఈ శాతం ఎన్నికలు పూర్తిగా ముగిసే సమయానికి పెరిగే అవకాశముంది.

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఎన్నికలు ఎప్పుడు జరిగినా భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సర్ ఆర్థర్ కాటన్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయటం పరిపాటి. అయితే ఆ స్కూల్ ఇరుపార్టీల మధ్య ఘర్షణలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రక్రియలోనూ ఆనవాయితీ తప్పకుండా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్య గొడవ జరిగింది. ఉదయం పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి వల్ల గొడవ జరిగితే, సాయంత్రం ఒక టీడీపీ చోటా నాయకుడు పచ్చ చొక్కా వేసుకువచ్చి ప్రదర్శించిన అత్యుత్సాహం వలన చోటు చేసుకుంది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. చూసుకుందాం అంటే..చూసుకుందాం అంటూ రెండు వర్గాలు పెద్ద ఎత్తున గొడవకు దిగారు. గొడవకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కారణమైతే తమ పార్టీ శ్రేణులను నిలువరించటమేమిటని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, పలువురు పార్టీ నాయకులు. విషయం తెలిసిన డీసీపీ హరికృష్ణతోపాటు సీఆర్‌పీ బృందం భారీగా మొహరించింది. టీడీపీకి చెందిన వర్గం రెచ్చగొట్టినా వైఎస్సార్ సీపీ వర్గం సంయమనం పాటించింది. ఒక దశలో రోప్ పార్టీ రంగంలోకి దిగి టీడీపీ వర్గాన్ని ఒక వైపు వైఎస్సార్ సీపీ వర్గాన్ని మరో వైపుకు పంపించేశారు. ఇంతలో పశ్చిమ నియోజకవర్గ టికెట్ ఆశించి సుజనా చౌదరి రంగంలోకి దిగటం సైలెంట్ అయిపోయిన వ్యాపారవేత్త వక్కలగడ్డ భాస్కరరావు వచ్చి మమ్మల్ని తరిమేస్తున్నారుగానీ వైఎస్సార్ సీపీ వర్గానికి మీరు నచ్చచెప్పలేరంటూ పోలీసులను నిలదీశారు. తమకు ఏ పార్టీ అయినా ఒకటేనని ఆయనకి నచ్చ చెప్పేందుకు పోలీసులు ప్రయత్నించినా భాస్కరరావు ఊరుకోకుండా ఏదేదో మాట్లాడుతుండంతో సహనం కోల్పోయిన పోలీసులు గట్టిగా చెప్పడంతో వెనక్కి తగ్గాడు. దాదాపు గంటకుపైగా పోలీసులు అక్కడే ఉండిపోవడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. దాంతో ఓటర్లు వచ్చి ఓటు వేయాల్సిందిగా మైక్‌లో చెప్పారు. కాగా ఇంత ఉద్రిక్తతకు సూత్రధారి అయిన టీడీపీ చోటా నాయకుడిని ఆ పార్టీ పెద్దలు అక్కడి నుంచి తప్పించేయటం గమనార్హం.

ఉదయం పోటెత్తిన మహిళలు...

పోలింగ్ బూత్‌ల్లో ఉదయం 7.30 గంటలకే మహిళలు వేలాదిగా పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు. ఉదయం ఏడున్నర నుంచి పదకొండు గంటల వరకూ ఆయా బూత్‌ల్లో మహిళలు భారీగా తరలివచ్చారు. పది గంటల సమయంలో ఏ పోలింగ్ బూత్‌లో చూసిన మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరి కనిపించారు. ప్రధానంగా నియోజకవర్గంలో అత్యధిక బూత్‌లు ఉన్న కేబీఎన్ కళాశాలలో, అక్కడికి సమీపంలో ఉన్న అన్నపూర్ణాదేవి పాఠశాల, రాజాహైస్కూల్ తదితర ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల్లో మహిళలు రోడ్లపై భారీగా బారులు తీరి దర్శనమిచ్చారు.

వించిపేటలో ఉద్రిక్తత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వించిపేటలో సోమవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. రిగ్గింగ్‌కు పాల్పడిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. మహ్మదాలీపురం యుపీ స్కూల్‌లోని 208వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలకు సీల్ వేసే సమయంలో టీడీపీ నేత ఎంఎస్ బేగ్ పలువురు నాయకులు బూత్‌లోకి ప్రవేశించారు. అదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ఎంఎస్ బేగ్‌ను బూత్‌లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం పెరిగింది. అప్పుడే అక్కడకు చేరుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఎందుకు ఇంత మంది టీడీపీ నేతలను బూత్‌లోకి రానిచ్చారని అధికారులను ప్రశ్నించారు. దానిపై స్పష్టమైన సమాధానం రాకపోవటంతో టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, సీసీ కెమేరాలు చూడాలని ఆసిఫ్ డిమాండ్ చేశారు. ఆ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు పెరిగాయి. టీడీపీ నేతలు బూతులు మాట్లాడుతూ ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు నాయకులు అక్కడకు చేరుకోవటం ఆ పరిసర ప్రాంతాలన్నీ ఉద్రిక్తంగా మారాయి. ఒక్కసారిగా ఇరు వర్గాలు ఒకరిపైకి ఒకరు ముందుకు దూసుకురావటంతో పోలీసులు ఒక్కసారిగా అందరినీ చెదరగొట్టారు. అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చారు.




పటమట హైస్కూల్లో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న బంధువులు, ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు



దుర్గాపురం ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేసిన వృద్ధుడు




వీల్‌చైర్‌లో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న దృశ్యం, ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు

పోటెత్తిన ఓటర్లు

బెజవాడ నగరంలో ఓటర్లు పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఎటు చూసినా ఓటేసేందుకు వస్తున్న ప్రజలే దర్శనమిచ్చారు. ఆయా కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన బూత్‌లలో ఏడు గంటలకే క్యూలైన్లు రద్దీగా దర్శనమిచ్చాయి. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, యువతులు పెద్ద సంఖ్యలో పోలింగ్‌కు తరలివచ్చారు. నడవలేని వృద్ధులను వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి పోలింగ్‌కు తీసుకొచ్చారు. గంట గంటకూ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తొలిసారిగా ఓటు వేసి పలువురు యువతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



పటమట ఎన్ఎస్ఎం స్కూల్ క్యూలైన్‌లో ఓటర్లు



పటమట ఎన్ఎస్ఎం స్కూల్ క్యూలైన్‌లో ఓటర్లు



నూతనంగా ఓటు వేసిన యువతి



లయోలా కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రజలు